# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 05-07-2025** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **అల్లూరి సీతారామరాజు పుట్టిన గ్రామాన్ని పర్యటక ప్రాంతంగా తీర్చిదిద్దుతున్నట్లు కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు.**
2. **ప్రజల ఆర్థిక పరిస్థితిని మెరుగుపరిచేందుకు పీ4 విధానాన్ని ప్రభుత్వం అమలు చేస్తోందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.**
3. **రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో అసెంబ్లీ, పార్లమెంటు స్థానాలు పెరగబోతున్నాయని తెలంగాణ ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి తెలిపారు.**
4. **ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యంలో కోల్ ఇండియాకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి వెల్లడించారు.**
5. **డీఎస్సీ పరీక్షలలో ఎంపికైన అభ్యర్థులకు ఆగస్టు నాటికి నియామక పత్రాలు అందజేయాలని ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఆదేశించారు.**

==========================

అల్లూరి సీతారామరాజు పుట్టిన గ్రామాన్ని పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దుతున్నట్లు కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. హైదరాబాదులోని శిల్పకళా వేదికలో నిన్న క్షత్రియ సేవా సమితి, భారత ప్రభుత్వ సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వేడుకల్లో కేంద్రమంత్రి పాల్గొన్నారు. గిరిజనుల కోసం అల్లూరి సీతారామరాజు అనేక పోరాటాలు చేశారని కేంద్ర మంత్రి పేర్కొంటూ..

– వాయిస్..33 సెకన్లు

--------------------------

విశ్వవిద్యాలయాలు సాంకేతికతపై దృష్టి పెట్టాలని ఆంధ్రప్రదేశ్ గవర్నర్ జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్ అన్నారు. జవహర్ లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం-కాకినాడ స్నాతకోత్సవంలో నిన్న గవర్నర్ పాల్గొన్నారు. విశ్వవిద్యాలయంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 40 మంది విద్యార్థులకు ఎండోమెంట్ అవార్డు, బంగారు పతకాలను అందజేశారు. గ్రాడ్యుయేషన్ జీవితంలో ఒక మంచి అధ్యాయమని గవర్నర్ తెలుపుతూ..

వాయిస్.. 31 సెకన్లు

--------------------------

ప్రజల ఆర్థిక పరిస్థితిని మెరుగుపరిచేందుకు ప్రభుత్వ, ప్రైవేటు, ప్రజల భాగస్వామ్యం – పీ4 విధానాన్ని ప్రభుత్వం అమలు చేస్తోందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి అధ్యక్షతన స్వర్ణాంధ్ర పీ4 ఫౌండేషన్ కమిటీ సాధారణ సమావేశం నిన్న జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. శాసనసభ్యులు సేవ చేసేందుకు పీ4 కార్యక్రమం మంచి అవకాశమని సూచించారు. ప్రతి నియోజకవర్గంలో 6 నుంచి 10 వేల బంగారు కుటుంబాలు ఎంపిక కాబోతున్నాయని వివరించారు.

---------------------------

రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో అసెంబ్లీ, పార్లమెంటు స్థానాల సంఖ్య పెరగనుందని తెలంగాణ ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి అన్నారు. హైదరాబాదులోని ఎల్బీ స్టేడియంలో కాంగ్రెస్ సామాజిక సమర భేరి సభ నిన్న నిర్వహించారు. ఏడాది లోపు కుల గణన, ఎస్సీ వర్గీకరణ చేసినట్లు ముఖ్యమంత్రి వివరిస్తూ..

– వాయిస్...29 సెకన్లు

---------------------------

పేదరికం లేని రాష్ట్రాన్ని సాకారం చేయడమే విజన్ 2047 లక్ష్యమని ఆంధ్రప్రదేశ్ ఎక్సయిజ్, భూగర్భ గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. అనకాపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో స్వర్ణంధ్ర 2047 కార్యక్రమంలో భాగంగా జిల్లా దార్శనికత కార్యాచరణ ప్రణాళిక పై జిల్లా స్థాయి కమిటీ సమావేశం నిన్న నిర్వహించారు. జిల్లాలో ఇప్పటి వరకు 2104 బంగారు కుటుంబాలు గుర్తించగా 1700 కుటుంబాలను దత్తత తీసుకున్నట్లు తెలిపారు. చదువుతో పాటుగా ఆర్థిక తోడ్పాటు అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు.

---------------------------

విశాఖపట్నాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దు నున్నట్లు ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. విశాఖపట్నం జిల్లా పాండ్రంగిలో భీమలి శాసన సభ్యులు గంటా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిన్న అల్లూరి సీతారామరాజు జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. అల్లూరి పోరాట స్ఫూర్తిని భావితరాలకు అందిస్తామని పేర్కొన్నారు.

---------------------------

ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యంలో కోల్ ఇండియాకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి పేర్కొన్నారు. హైదరాబాదులో కోల్ ఇండియా ఆధ్వర్యంలో జరిగిన అంతర్జాతీయ సదస్సులో నిన్న ఆయన పాల్గొని మాట్లాడారు. అత్యాధునిక సాంకేతికతను వినియోగించి ఖనిజాలు వెలికి తీస్తున్నట్లు తెలిపారు. గనుల లీజు రెన్యువల్ కు ఏక గవాక్ష విధానాన్ని అందుబాటులోకి తెచ్చినట్లు వివరించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో నిర్వహించిన ఉపాధ్యాయ అర్హత పరీక్ష డీఎస్సీలో ఎంపికైన అభ్యర్థులకు ఆగస్టు నాటికి నియామక పత్రాలు అందజేయాలని విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అధికారులను ఆదేశించారు. గుంటూరు జిల్లా ఉండవల్లిలోని మంత్రి నివాసంలో నిన్న ఉన్నత పాఠశాల, ఇంటర్మీడియట్ విద్య, నైపుణ్యాభివృద్ధి– శిక్షణ శాఖలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని అధికారులను ఆదేశించారు.

ఈనెల 10వ తేదీన జరిగే తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశాన్ని విజయవంతం చేసేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు.

----------------------------

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అన్నారు. చిత్తూరులో ఆయన నిన్న పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రైతు పట్ల ప్రభుత్వం నిబద్ధతతో వ్యవహరిస్తుందని పేర్కొన్నారు. మామిడి రైతులను ఆదుకునే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు.

----------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని నంద్యాల జిల్లా శ్రీశైల క్షేత్రంలో మల్లికార్జున స్వామి వారి 'ఉచిత స్పర్శ దర్శనం' టోకెన్‌లను ఆన్‌లైన్ విధానంలో ప్రవేశ పెడుతున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి ఎం. శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. వచ్చేవారం నుంచి ఆన్‌లైన్‌లో టోకెన్లు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. శ్రీశైల దేవస్థానం అధికారిక వెబ్‌సైట్‌ల ద్వారా ఉచిత స్పర్శ దర్శనం టోకెన్లను పొందాల్సి ఉంటుందని వివరించారు. ఇందుకు గానూ భక్తులు తమ పేరు, చిరునామా, ఆధార్ నంబర్‌ను నమోదు చేసుకోవాలని తెలిపారు.

----------------------------

నీటి సంరక్షణ, నిర్వహణతో పాటు, ముఖ్యంగా వర్షపు నీటిని సద్వినియోగం చేసుకోవడానికి కేంద్ర ప్రభుత్వం జలశక్తి అభియాన్‌లో వర్షపునీరు ఒడిసిపట్టడం "క్యాచ్ ది రైన్" కార్యక్రమాన్ని చేపట్టింది. "ప్రజా అవగాహన దిశగా నీటి సేకరణలో ప్రజల భాగస్వామ్యం" అనే ఇతివృత్తంతో దేశవ్యాప్తంగా 148 జిల్లాలలో ఈ ప్రచారాన్ని ఈ ఏడాది మార్చి 22 నుండి నవంబర్ 30 వరకు నిర్వహిస్తోంది. ప్రజలు వర్షపు నీటిని సేకరించి, భవిష్యత్తులో ఉపయోగించుకునేలా ప్రోత్సహించాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తోంది.

ఇందులో భాగంగా వాతావరణ మార్పుల ద్వారా పెరుగుతున్న నీటి కొరత నేపథ్యంలో నీటి భద్రత, వర్షపు నీటి సంరక్షణ, భూగర్భ జలాల పునరుజ్జీవనం ప్రాముఖ్యతపై పలు అవగాహనా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

----------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని ప్రస్తుత వాతావరణ పరిస్థితిపై అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం అధికారి ఎల్.నారాయణ ఆకాశవాణి ప్రాంతీయ వార్తా విభాగానికి వివరిస్తూ..

వాయిస్…27 సెకన్లు

మరోవైపు.. తెలంగాణాలో ఈరోజు తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం పేర్కొంది.

====================